క్లుప్తంగా

స్వర్ణకిరీటం తయారీకి రూ.50వేలు విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని కాకివీధిలో కొలువుదీరిన ముత్యాలమ్మ తల్లికి స్వర్ణ కిరీటం చేయించేందుకు పిండి మీనాక్షి శ్రీనివాస్ దంపతులు తమ వంతుగా రూ.50,011ను కమిటీ సభ్యులకు ఆదివారం విరాళంగా అందించారు. కార్యక్రమంలో పిండి శారద, నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదాతలను సత్కరిస్తున్న నిర్వాహకులు

శ్రీకాకుళం కల్చరల్: విద్యార్థులకు విలువలతో కూడిన విద్య నేర్పినప్పుడే ఉన్నత లక్ష్యాలను చేరుకోగలరని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన రావు అన్నారు. పీఎన్ కాలనీలోని న్యూసెంట్రల్ స్కూల్ 31వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 251 యూనిట్ల రక్తాన్ని సేకరించి రక్తదాతలకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి బలివాడ మల్లేశ్వరరావు, పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ రమాకుమారి, డైరెక్టర్లు పి.శ్రీకాంత్, శ్రీదేవి, వైకుంఠరావు, రెడ్‌క్రాస్ ప్రతినిధి పెంకి చైతన్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ ఇన్‌చార్జిల పాలన?



మూసి ఉన్న గార తహశీల్దార్ గది

గార: మండలంలోని పలు శాఖలు ఇంకా ఇన్‌చార్జిల పాలనలోనే నడుస్తున్నాయి. ప్రధాన శాఖల అధికారుల పోస్టులు రెండు నెలలు గడుస్తున్నా భర్తీ కాకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే తిష్ట వేస్తున్నాయి. తహశీల్దార్‌గా పనిచేసిన సనపల రమణారావు ఉద్యోగ విరమణ చేసి రెండు నెలలు పూర్తయినా ఇప్పటికీ ఇన్‌చార్జితోనే నెట్టుకువస్తున్నారు. దీంతో అపరిష్కృతంగా ఉన్న భూముల సమస్యలను ఎవరికి విన్నవించాలో తెలియక అన్నదాతలు అయోమయం చెందుతున్నారు. వేసవి సమీపిస్తున్న తరుణంలో శాలిహుండం రక్షిత పథకానికి సైట్ ఇంజినీరు వెంకటేశ్వర్లు ఇన్‌చార్జిగానే వ్యవహరిస్తున్నారు. ఉపాధి హామీ విషయానికి వస్తే ఈసీ మార్చి 31న పదవీ విరమణ చేయనున్నారు. ఇలా గార మండలంలో ప్రధాన పోస్టులన్నీ ఇన్‌చార్జిలతోనే కొనసాగిస్తున్నారు.

దీర్ఘకాలిక సెలవులో ఎచ్చెర్ల ఎంపీడీఓ!

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ఎంపీడీవో సీపాన హరిహరరావు ఈ నెల 5 నుంచి రెండు నెలల పాటు దీర్ఘకాలిక వెళ్లనున్నట్లు సమాచారం. వ్యక్తిగత కారణాలతో సెలవు పెడుతున్నట్లు ఆయన చెబుతున్నా.. ఒత్తిళ్లు, స్థానిక కార్యాలయంలో ఉన్న సిబ్బంది సహకరించకపోవటం వల్ల ఆయన సెలవుపై వెళుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవల మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు మెటీరియల్ కాంపొనెంట్ పనులు మండలానికి సంబంధించి రూ.8 కోట్లతో 124 పనులు మంజూరయ్యాయి. కొన్ని పూర్తికాగా, కొన్ని జరుగుతున్నాయి. గ్రామసభ, మండల పరిషత్ తీర్మానం చేసిన పనుల స్థానంలో అధికార పార్టీ ప్రజా ప్రతినిధి ప్రతిపాదించిన పనులకు అగ్రిమెంట్ చేయాలని ఉన్నతాధికారులు సూచించడంలో క్షేత్రస్థాయిలో ఎంవోలపై ఎంపీడీవో సంతకాలు చేశారు. మరోవైపు సమయం పెంచుతూ మళ్లీ పాత ఫైళ్ల మార్పులు చేశారు. ఈ అంశాలపై స్థానిక ఎంపీపీ, హైకోర్టు న్యాయవాది మొదలవలస చిరంజీవి హైకోర్టులో కేసులు వేశారు. ఈ పనులకు ఉపయోగించే మెటీరియల్ టెండర్లు పిలవలేదని, పనుల్లో జాబ్‌కార్డు ఉన్న వేతనదారులకు పని కల్పించడం లేదని, జరిగిన పనుల్లో నాణ్యత లేదని పలు ఫిర్యాదులు చేశారు. ఈ నేపథ్యంలో పూర్తిస్థాయిలో పనులు చేసినా బిల్లులు చెల్లించటం సాధ్యం కావడం లేదు. న్యాయపరమైన చిక్కులు, పాలనా పరమైన ఇబ్బందులు, అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లు వెరసి ఎంపీడీవో లాంగ్‌లీవ్‌పై వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. మరోవైపు మండలం నుంచి బదిలీ చేయాలని సైతం ఉన్నతాధికారులను అనేక సార్లు కోరారు. జనవరిలో సైతం మండస్థాయి ప్రజా ప్రతినిధితో వివాదం కారణంగా 12 రోజుల పాటు సెలవుపై వెళ్లారు. ఈ సమయంలో ఇన్‌చార్జి బాధ్యతలు సైతం తీసుకోవడానికి ఎవ్వరూ ముందుకు రాలేదు.

పేద విద్యార్థులకు బాసటగా..

- సత్యసాయి పెద్ద మందిరంలో ఉచితంగా ట్యూషన్
- రూ.35 వేలు విలువైన దుస్తులు వితరణ
- స్ఫూర్తిగా నిలుస్తున్న సేవా సంస్థ



చిన్నారులకు ట్యూషన్ నిర్వహిస్తున్న దృశ్యం



నూతన వస్త్రాలను అందిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు(ఫైల్)

శ్రీకాకుళం కల్చరల్ : స్కూల్ నుంచి వచ్చిన వెంటనే కొందరు విద్యార్థులు సెల్‌ఫోన్లకు అతుక్కుపోతుంటారు. హోమ్‌వర్కు చేయమంటే మొండికేస్తుంటారు. మరికొందరు చిన్నారులు పాఠ్యాంశాల్లో సందేహాలు ఉన్నా బడిలో ఉపాధ్యాయులకు అడగాలంటే ఏమనుకుంటారోనని బెరుకు. ఇలా రకరకాల కారణాలతో సతమతమవుతున్న, తమను సతాయిస్తున్న పిల్లలను తల్లిదండ్రులు ట్యూషన్ల(ప్రైవేటు)కు పంపించేస్తుంటారు. అయితే పేద పిల్లలు మాత్రం ఫీజులు కట్టలేక ఇంటి పట్టునే ఉండిపోతున్నారు. ఇలాంటి వారి కోసం జిల్లా కేంద్రంలోని సత్యసాయి సేవా సంస్థలు బాసటగా నిలుస్తున్నాయి. సత్యసాయి పెద్దమందిరంలో ఉచితంగా ట్యూషన్ నిర్వహిస్తూ విద్యాభివృద్ధికి తమవంతు తోడ్పాటునందిస్తున్నాయి. ఇక్కడ చదివిన ఎంతో మంది పేద విద్యార్థులు వివిధ ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు సాధించి ఉన్నత స్థానాలను అధిరోహిస్తున్నారు. వారు కూడా కృతజ్ఞతతో తాము పనిచేస్తున్న చోట విద్యార్థులకు ఉచితంగా ట్యూషన్స్ చెబుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

పదో తరగతి వరకు..

నగరంలోని పెద్దమందిరానికి దగ్గరగా ఉన్న మున్సిపల్ హైస్కూల్లో చదువుతున్న ఎంతో పేద విద్యార్థులు ఇక్కడికి ఎక్కువగా చదువుకోవడానికి వస్తుంటారు. 2వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు రోజూ ట్యూషన్లకు హాజరవుతున్నారు. ప్రతి రోజూ సాయంత్రం 5 నుంచి 7.30గంటల వరకు ట్యూషన్లు జరుగుతాయి. ఇక్కడ ఉచితంగా ట్యూషన్ చదివి బెంగళూరులో ఉద్యోగం సాధించిన ఓ విద్యార్థి అక్కడ తనవంతుగా చిన్నారులకు ఖాళీ సమయంలో ఉచితంగా ట్యూషన్లు చెబుతున్నారు. మహాలక్ష్మీనగర్ కాలనీలోనూ ఓ ఉన్నత విద్యార్థి పిల్లలకు ఉచితంగా ట్యూషన్ నిర్వహిస్తున్నారు.

దుస్తులు సైతం..

పెద్దమందిరంలో ట్యూషన్ చదువుతున్న 60 మంది విద్యార్థులకు రూ.35వేలు విలువైన దుస్తులను మందిరం కన్వీనర్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు పంపిణీ చేశారు. అబ్బాయిలకు తెలుపు ఫ్యాంట్, చొక్కా, అమ్మాయిలకు పంజాబీ డ్రెస్ కుట్టించి అందజేశారు.

మా వంతు ప్రయత్నం..



ట్యూషన్ చదివించలేని తల్లిదండ్రుల కోసం మావంతు ప్రయత్నం చేస్తున్నాం.ప్రస్తుతం ట్యూషన్ చెప్పేందుకు నలుగురు టీచర్లు పనిచేస్తున్నారు. కొన్ని సబ్జెక్టులకు టీచర్లు అవసరముంది. సేవాభావం కలిగిన వ్యక్తుల కోసం చూస్తున్నాం.

– కంబ మురళీ, కన్వీనర్, సత్యసాయి పెద్దమందిరం

బాగా చెబుతున్నారు



ప్రతి సబ్జెక్టులో ఉన్న సందేహాలను బాగా చెబుతున్నారు. మాలాంటి విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంది. హోమ్‌వర్కులు కూడా ఇక్కడే చేసుకుంటున్నాం.

–లక్ష్మణ్, 7వ తరగతి, శ్రీకాకుళం

ఇక్కడే హోంవర్క్



మేము కవలలం. మా ఇల్లు ఇక్కడికి దగ్గరే. స్కూల్లో మాకు ఇచ్చిన హోంవర్కు ఇక్కడే పూర్తి చేస్తుంటాం. ఎలాంటి సందేహాలున్నా చక్కగా చెబుతుంటారు.

– యోచన, యోగిత, 2వ తరగతి, శ్రీకాకుళం

సూపర్ సిక్స్ హామీలు అమలయ్యేదెన్నడు?



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణరావు, నాయకులు

ఎచ్చెర్ల క్యాంపస్: సూపర్ సిక్స్ హామీలను కూటమి ప్రభుత్వం ఎప్పుడు అమలు చేస్తుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సనపల నారాయణరావు ప్రశ్నించారు. ఎచ్చెర్లలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఖరీఫ్ ముగిసినా రైతు భరోసా ఇవ్వ లేదని, విద్యా సంవత్సరం ముగుస్తున్నా తల్లికి వందనం అమలు చేయలేదని చెప్పారు. బీసీలకు 50 ఏళ్లకు పింఛన్, మత్స్యకార భరోసా, మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల ఊసేలేదన్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ వాస్తవాలకు దూరంగా ఉందని చెప్పారు. హామీలు అమలుకు పూర్తిస్థాయిలో కేటాయింపులు లేవని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అప్పులు మయంగా మార్చారని దుయ్యబట్టారు. అనర్హత పేరుతో దివ్యాంగుల పింఛన్లు రద్దు చేస్తున్నారని మండిపడ్డారు. నిరుద్యోగులు భృతి కోసం ఎదురు చూస్తున్నారని చెప్పారు. గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లు జరగక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు బోర సాయిరాం రెడ్డి, నాయకులు, ప్రజా ప్రతినిధులు నేతింటి నీలమప్పడు, అంబటి రాంబాబు, బెండు రామారావు, బొడ్డేపల్లి సుధాకర్, ముద్దాడ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్ఎం పురం ఏపీ గురుకులం (బాలురు)లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.గుణస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. 2025–26 విద్యా సంవత్సరంలో 5వ తరగతిలో ప్రవేశాలు, 6, 7, 8 తరగతిలో ఖాళీ సీట్లకు, రాష్ట్రం యూనిట్‌గా ఏపీ గురుకుల విద్యాలయ సంస్థ నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్, డిగ్రీ మొదటి ఏడాది ప్రవేశాలకు ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు హెచ్‌టీటీపీఎస్://ఏపీఆర్ఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

నిరుపయోగంగా సామూహిక మరుగుదొడ్లు



మురపాకలో వృథాగా ఉన్న సామూహిక మరుగుదొడ్లు

ఎచ్చెర్ల : ప్రజాప్రతినిధులు, అధికారులు అనాలోచిత నిర్ణయాల కారణంగా లక్షలాది రూపాయలతో గ్రామాల్లో నిర్మించిన కమ్యూనిటీ మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. 2014–19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం అవసరం లేని చోట్ల కూడా ప్రజాధనం వెచ్చి సామూహిక మరుగుదొడ్లు నిర్మించింది. లావేరు మండలం మురపాక, లావేరు. కేశవరాయునిపాలేం, పెద్దరావుపల్లి తదితర గ్రామాల్లో నిర్మించిన మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి.రన్నింగ్ వాటర్ సదుపాయం లేక స్థానికులు ఉపయోగించకుండా అప్పట్లోనే విడిచిపెట్టేశారు. కొన్ని గ్రామాల్లో కమ్యూనిటీ మరుగుదొడ్లు అవసరం లేకపోయినా కేవలం టీడీపీ నాయకులకు కాంట్రాక్ట్ పనులు అప్పగించడం కోసం మరుగుదొడ్లు నిర్మించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో లక్షలాది రూపాయల ప్రజాధనం వృథాగా మారింది.

సమాజ శ్రేయస్సుకు పాటుపడాలి

శ్రీకాకుళం అర్బన్:

వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు సమాజ నిర్మాణానికి శ్రేయస్సుకు పాటుపడే స్వచ్ఛంద సంస్థలో వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ నిలవడం గర్వకారణమని శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పీవీవీడీ ప్రసాద్ అన్నారు. ఆదివారం శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో స్టార్ వాకర్స్ క్లబ్, స్టార్ వనితా వాకర్స్ క్లబ్‌ల నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. ముందుగా వాకర్స్ నూతన గవర్నర్ కొంక్యాన మురళీధర్, వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ మాజీ గవర్నర్ పీజీ గుప్తా మాట్లాడుతూ సంస్థలు అందిస్తున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు కె.సత్యం, ప్రకాశరావు, గుడ్ల సత్యనారాయణ, ఎలక్టెడ్ గవర్నర్ ఏ.తిరుపతిరావు, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ యాళ్ల పోలినాయుడు. స్టార్ వాకర్స్ క్లబ్ ఫౌండర్ గేదెల ఇందిరాప్రసాద్, స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు ఎస్.జోగినాయుడు, రత్నాల వరప్రసాద్, డాక్టర్ జి.నారాయణరావు, బీవీ రవిశంకర్, సుగంధం సంజీవరావు, చలపాక సూర్యారావు, గురు ఆనందరావు, గజెల్స్ వాసుదేవాచారి, తదితరులు పాల్గొన్నారు. స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడిగా గుడ్ల జగ్గారావు, స్టార్ వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలిగా గేదెల లక్ష్మీ ఎన్నికయ్యారు. అనంతరం శ్రీనిధి మెడికల్ ప్లాజా ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.



మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్ పీవీవీడీ ప్రసాద్

నగరంపై డ్రోన్ నిఘా

శ్రీకాకుళం నగరంలోని రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతినగర్ కాలనీ, భైరివానిపేట, నాగావళి రివర్ వ్యూపార్కు, బలగ తదితర నదీతీర ప్రాంతాలు, పట్టణ శివారు నిర్మానుష్య ప్రాంతాల్లో డ్రోన్ నిఘా పెట్టారు. బహిరంగంగా మద్యం సేవించడం, గంజాయి సేవించేవారిని అరికట్టేందుకు ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఆదేశాలతో ఆదివారం సాయంత్రం ఈ డ్రోన్ ఎగురవేశారు.

– శ్రీకాకుళం క్రైమ్



శాంతినగర్ కాలనీలో..



మనిషి కదలికలను గుర్తిస్తూ..



నాగావళి నదీ పరివాహక ప్రాంతంలో..

కనకదుర్గకు విశేష అలంకరణ



లావేరులోని కనక దుర్గాదేవి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు నేతేటి రుషికుమార్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, వివిధ రకాల పుష్పలతో అలంకరించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

– ఎచ్చెర్ల

ఒంటికి యోగా మంచిదేగా..



ప్రస్తుత పరీక్షల సీజన్‌లో విద్యార్థులు యోగ సాధన చేస్తే ఏకాగ్రత పెరుగుతుందని లావేరు శాఖా గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం స్థానిక గ్రంథాయంలో చిన్నారులకు యోగా తరగతులు నిర్వహించారు. 32 రకాల యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు పాల్గొన్నారు.

– ఎచ్చెర్ల

ఉత్సాహంగా పోటీలు



పాత శ్రీకాకుళంలోని ధర్మశాస్త్ర ఆలయ ఆవరణలో చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో చిన్నారులకు తెలుగు పత్రిక పఠన పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఎల్.నందికేశ్వరరావు, బీఎంఎస్ పట్నాయిక్, ప్రసాద్, ఎల్.దీప్తి పాల్గొన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

వాహనచోదకులకు అవగాహన



సవరించిన మోటారు వాహన చట్టం ప్రకారం ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ సీఐ నాగరాజు కోరారు. ఈ మేరకు ఆదివారం నగరంలోని పలు కూడళ్లలో ప్రత్యేక ఫ్లెక్సీని ప్రదర్శించి వాహనచోదకులకు అవగాహన కల్పించారు. జరిమానాలు భారీగా పెరిగినందున నిబంధనల మేరకు వాహనాలను డ్రైవ్ చేయాలని సూచించారు.

– శ్రీకాకుళం క్రైమ్

శ్రీకూర్మనాథాలయానికి పోటెత్తిన భక్తజనం

- అధిక సంఖ్యలో భక్తులు రాక
- పార్కింగ్ లేక తప్పని అవస్థలు



శ్రీకూర్మనాథుని దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు



తొలి ధ్వజస్తంభం వద్ద భక్తుల రద్దీ

గార : ఆది కూర్మక్షేత్రం శ్రీకూర్మనాథాలయానికి ఫాల్గుణమాస ఆదివారం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు రావడంతో క్షేత్రం కిటకిటలాడింది. ఎప్పట్లాగే దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తమ వాహనాల పార్కింగ్‌కు ఇబ్బందులు పడ్డారు. ఆలయ సమీపంలో అనువైన స్థలం లేక అవస్థలు పడ్డారు. కారు, ఆటో, బైక్‌లు పెట్టేందుకు స్థలం చూపించకపోవడం, ఆశీలు మాత్రం పంచాయతీ పేరిట వసూలు చేస్తుండటంతో ఇబ్బందులు మరింత ఎక్కువయ్యాయి. గ్రామంలో వాహనాలు ఎక్కడికక్కడ బారులు తీరాయి. శ్రీకూర్మం కామదహన మంటపం వరకు చిన వత్సవలస నుంచి వచ్చే వాహనాలు నిలిచిపోయాయి. మరోవైపు ఉచిత దర్శనం లైనులో సమయం ఎక్కువ పడుతోందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఆలయ ఇన్‌చార్జి ఈవో జి.గురునాథరావు వద్ద 'సాక్షి' ప్రస్తావించగా ప్రతి శని, ఆదివారాల్లో భక్తుల రద్దీకి తగ్గట్లు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గర్భగుడిలో ఏసీ సౌకర్యం ఉందని, ఒకవేళ భక్తులు క్యూలైన్‌లో ఇబ్బందులు పడే పరిస్థితి ఉంటే వెంటనే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

యోగాతో మానసికోల్లాసం



బీసీ బాలికల వసతిగృహం విద్యార్థినులతో యోగా చేయిస్తున్న ఎస్ఐ లక్ష్మి

శ్రీకాకుళం క్రైమ్ : మహిళా సాధికారిత, భద్రతే ప్రాధాన్యంగా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 8 వరకు మహిళా సాధికారిత వారోత్సవాలు జరగనున్నాయి. ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ బాలికల సంక్షేమ వసతి గృహాలు, స్కూళ్లను పోలీసులు సందర్శించి విద్యార్థినులకు యోగా తరగతులు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించనున్నారు. ఈ క్రమంలో ఆదివారం శ్రీకాకుళం ప్రభుత్వ బాలికల వసతి గృహాల్లో ఎస్ఐ లక్ష్మి విద్యార్థినులకు యోగా తరగతులు నిర్వహించారు. అనంతరం సైబర్ క్రైమ్, పోక్సో, గుడ్ అండ్ బ్యాడ్ టచ్, బాల కార్మిక చట్టాలు, మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, ఆకతాయిల వేధింపులు, ఈవ్ టీజింగ్ ర్యాగింగ్ నుంచి రక్షణ, సామాజిక మాధ్యమాల వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఎటువంటి సమస్య ఎదురైనా బాలికలు నిర్భయంగా పోలీసులకు తెలియజేయాలని ఎస్ఐ లక్ష్మి సూచించారు.